క్లుప్తంగా

'బీజేపీలో మహిళలకు సముచిత స్థానం'



సరితతో మాట్లాడుతున్న వివేక్

మందమర్రిరూరల్: బీజేపీలో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీ వివేక్ అన్నారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన మందమర్రికి చెందిన బత్తుల సరితను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీలో తనకు జరిగిన అవమానాన్ని వివేక్‌తో సరిత పంచుకున్నట్లు తెలిసింది. బీజేపీలో చేరినట్లెతై సముచిత స్థానం కల్పిస్తామని వివేక్ హామీ ఇవ్వగా, ఆలోచిస్తానని సరిత తెలిపినట్లు సమాచారం. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ ఉన్నారు.

కొనసాగుతున్న 'బడిబాట'



దండేపల్లి: బడిబాటలో ఉపాధ్యాయులు

దండేపల్లి/తాండూర్: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం కొనసాగుతుంది. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీటీచర్లు, సీఆర్పీలు ఇంటింటా తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని, చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. దండేపల్లి మండలంలోని ధర్మరావుపేట, నర్సాపూర్, నెల్కివెంకటాపూర్‌లో గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించగా, తాండూర్‌లోని రేపల్లెవాడలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత ఇంటింటికీ వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కల్పిస్తున్న విద్యా, వసతులపై అవగాహన కల్పించారు.

విజయవంతం చేయండి

చెన్నూర్: బాసర నుంచి భద్రాచలం వరకు కొనసాగే గోదావరి హారతి యాత్రను విజయవంతం చేయాలని గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ తెలిపారు. గోదావరి నదీమతల్లి విశిష్టతను చాటిచెబుతూ స్వచ్ఛ గోదావరి సాధనే లక్ష్యంగా ప్రాచీన దేవాలయాలను సందర్శిస్తూ యాత్ర సాగుతుందన్నారు. యాత్ర మంగళవారం చెన్నూర్ పట్టణంలోని జగన్నాథాలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. యాత్రలో గోదావరి హారతి వ్యవస్థాపకులు పి.మురళిధర్‌రావు, హనుమాన్ పీఠం సిద్ధాంతి పాలేరు మనోహర్ శర్మ, మాజీ పార్లమెంట్ సభ్యులు గడ్డం వివేక్‌వెంకటస్వామి పాల్గొంటారని తెలిపారు. పట్టణ ప్రజలు యాత్రలో పాల్గొని సంఘీభావం తెలుపాలని కోరారు.

11న ప్రజాగర్జన బహిరంగ సభ

బెల్లంపల్లిరూరల్: సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 11న భద్రాది కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ అన్నారు. సోమవారం బెల్లంపల్లిలోని సీపీఐ కార్యాలయం బాశెట్టి గంగారాం భవన్‌లో పట్టణ కార్యదర్శి డీఆర్ శ్రీధర్ ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రెడ్ డి.రాజా, కె.నారాయణ, కూనమనేని సాంబశివరావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, దాసు, చంద్రశేఖర్, నర్సయ్య, లింగయ్య, సుదర్శన్, ఉపేందర్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములు కాపాడడంలో విఫలం'

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని 422 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తులా మధుసూధన్‌రావు అన్నారు. సోమవారం అధికారుల తీరును నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. కలెక్టర్ స్పందించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, సోమా ప్రదీప్‌చంద్ర, విజయ్‌కుమార్, బల్ల శివశంకర్, సత్యనారాయణ, తాజొద్దిన్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని (ఆల్ఫోర్స్) పాఠశాల యాజమాన్యం స్టేట్ బోర్డు పర్మిషన్ తీసుకుని, ఇంటర్నేషనల్ స్కూల్‌గా ప్రచారం చేసుకుంటూ విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ మోసం చేస్తుందని ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు అన్నారు. ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని సోమవారం డీఈవో యాదయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీపార్టీ నాయకులు నల్ల నాగేంద్రప్రసాద్, నయీంపాషా, రాజు పాల్గొన్నారు.



వేమనపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న పంచాయతీ సిబ్బంది



మాలగురిజాలలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు



భీమారంలో అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రతిజ్ఞ

ఘనంగా పర్యావరణ దినోత్సవం

చెన్నూర్‌రూరల్/తాండూర్/భీమారం/పాతమంచిర్యాల/నెన్నెల/బెల్లంపల్లిరూరల్/వేమనపల్లి/కాసిపేట/చెన్నూర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యావరణం పరిరక్షణకు పాటు పడాలని, మొక్కలు నాటి కాపాడాలని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటడం, పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని తీర్మానాలు చేశారు. పర్యావరణంతోనే మానవాళి మనుగడ సాధ్యమన్నారు. కాలుష్యాన్ని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని తెలిపారు. మొక్కలను సంవృద్ధిగా పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. కాసిపేట ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మహేంద్ర ప్రతాప్ జోషి పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు, పోటీలు నిర్వహించి మొక్కలు నాటారు. చెన్నూర్‌లో ప్రముఖ కవి సాహిత్య కేసరి నీర్ల మధునయ్య 8వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

లక్సెట్టిపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఎఫ్ఆర్వో నగావత్‌స్వామి, డీఆర్వో అజహర్, న్యాయవాదులు పాల్గొన్నారు.



కాసిపేట: ఓరియంట్ కంపెనీ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, కార్మికులు



తాండూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు



ఎర్రగుంటపల్లిలో ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



చెన్నూర్: మొక్క నాటుతున్న నాయకులు

తెలంగాణ రాష్ట్రానికి సింగరేణితో పేగుబంధం

- ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్

మందమర్రిరూరల్: ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సింగరేణి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఏరియా జీఎం మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, సింగరేణి డైరెక్టర్ (పీపీ) బలరాంనాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి సింగరేణి సంస్థ పేగుబంధంగా పెనవేసుకుందన్నారు. ప్రత్యక్షంగా వేలాది మందికి, పరోక్షంగా లక్షలాది కుటుంబాలకు జీవనాధారమైన సంస్థపై ముఖ్యమంత్రికి మక్కువ ఎక్కువన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సింగరేణి ఎంతో పురోగతి సాధించిందని, వేలాది కోట్ల లాభాలు అర్జిస్తూ కేసీఆర్ చొరవతో కారుణ్య ఉద్యోగనియామకాల వంటి హక్కులను సాధించి దేశంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీపరం చేయాలని చూస్తుందని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంత వరకు ప్రైవేట్‌పరం చేయకుండా అడ్డుకుంటామన్నారు. సింగరేణి ఉద్యోగుల సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి చెందుతుందని ఉద్యోగులను అభినందించారు. మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో సింగరేణి ప్రగతికి సంబంధించిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏరియాలోని ఉత్తమ ఉద్యోగులను శాలువాలు కప్పి సన్మానించారు. నూతనంగా పలువురికి కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు అందించారు. పలు పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. సింగరేణి ప్రగతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు ఏరియాలోని సీఈఆర్ క్లబ్ నుంచి సింగరేణి హైస్కూల్ వరకు సింగరేణి టార్చ్ చేబూని అధికారులు, ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఓదెలు, రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్, ఎస్వో టూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు యశోద, యూనియన్ల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ బాల్క సుమన్



నృత్యం చేస్తున్న చిన్నారులు

రాముని చెరువు ప్రభుత్వ భూమిని కాపాడాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని రాముని చెరువుకట్టను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని, కబ్జాదారుల నుంచి కాపాడాలని రాముని చెరువు వాకర్ సభ్యులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్‌ను కలిసి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువుకట్టను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, రాత్రికి రాత్రే అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. అన్యాక్రాంతమవుతున్న భూముల్లో ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. చెరువులోని మురుగునీటితో దుర్గంధం వెదజల్లుతోందని, చెరువులోని పూడిక తీయాలన్నారు. చెరువులో మురుగు నీరు కలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత కార్మికసంఘం అధ్యక్షుడు వాకర్స్ సభ్యులు వెంకటయ్య, నాయకులు జయరామారావు, ఎస్ఆర్ శ్యాం, జ్ఞానీ, సత్యనారాయణ మూర్తి, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

సింగరేణి గనులపై సంబురాలు

శ్రీరాంపూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణి గనులపై సోమవారం సంబురాలు జరుపుకున్నారు. గనులపై మేనేజర్లు జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం కంపెనీ సాధించిన ప్రగతిని వివరించారు. ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు.

జైపూర్: జైపూర్ మండలం ఇందారం ఐకే 1ఏ గని, ఐకే-ఓసీపీ ప్రాజెక్టుపై సంబురాలు జరుపుకున్నారు. గనిపై తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉద్యోగుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లుగా పీవో శ్రీనివాస్ తెలిపారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. గని మేనేజర్లు రవికుమార్, బ్రహ్మాజీ రావు, నాగన్న, పిట్ సెక్రెటరీలు గడ్డం మల్లన్న, రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

చెన్నూర్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో మనోరమ అన్నారు. పట్టణంలోని బట్టిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేశారు. సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్ సావిత్రి, హెల్పర్లు లక్ష్మీ, పోసక్క పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మేరవాడ, అశోక్‌రోడ్ సెక్టార్‌లోని గోపాల్‌వాడ, వేముల బస్తీ, క్యాబిన్ ఏరియా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో స్వరూప, సూపర్‌వైజర్ రమాదేవి, ఇందిరా పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. బెల్లంపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.



సీమంతం చేస్తున్న సీడీపీవో, సూపర్‌వైజర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి సెక్టారు పరిధిలోని దుగ్నెపల్లి, సుందరసాల, నాగాపూర్, ఆస్నాద అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతం చేశారు. అలాగే 6 ఏళ్ల లోపు పిల్లల బరువు ఎత్తులను కొలిచారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాజమ్మ, సుజాత, మాధవి, ఉర్మిల, వనజారాణి పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు

భీమారం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఎంపీవో సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

పాతమంచిర్యాల: తెలంగాణ బీసీ జాగృతి పట్టణ కమిటీని జిల్లా కేంద్రంలోని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వైద్యభాస్కర్ సోమవారం ప్రకటించారు. పట్టణ ఉపాధ్యక్షులుగా చింతల మల్లేష్, బియ్యాల సత్తయ్య, పెద్దపల్లి సూరన్న, హిమ్మత్‌సింగ్, మెంత్యాల సంతోష్ ఎంపిక కాగా, ప్రధాన కార్యదర్శులుగా బొలిశెట్టి లక్ష్మణ్, జక్కుల రాజు ఎన్నికయ్యారు. మొత్తం కార్యవర్గాన్ని, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నిరంతరం విద్యుత్ అందించిన ఘనత బీఆర్ఎస్‌దే

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: అంధకారంలో ఉన్న గ్రామాల్లో నిత్యం విద్యుత్ సరఫరా చేస్తూ, గ్రామీణుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో బెల్లంపల్లి శివారులోని ఆర్పీ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన తెలంగాణ విద్యుత్ విజయోత్సవ కార్యక్రమానికి చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ బెల్లంపల్లి డివిజనల్ ఇంజినీర్ రాజన్నతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల పాలనలో అనేక గ్రామాలు అంధకారంలోనే ఉన్నాయని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరంతరం విద్యుత్ సరఫరా చేసి రైతన్నలకు అండగా నిలిచిందని సూచించారు. విద్యుత్ సరఫరాలో రాష్ట్రం దేశానికే ఆదర్శమన్నారు. డివిజనల్ ఇంజినీర్ రాజన్న మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు లేకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను విద్యుత్ శాఖ అధికారులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్, ఎంపీపీ శ్రీనివాస్, తాండూర్ జెడ్పీటీసీ బానయ్య, విద్యుత్‌శాఖ అధికారులు శ్రీనివాస్, రాంచందర్, శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, విద్యుత్ సిబ్బంది, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

అటెన్షన్ ప్లీజ్.. ప్రైవేట్ భవనంలో ఆరోగ్య ఉపకేంద్రం..!

భీమారం: మండలంలోని దాంపూర్‌లో ఏడేళ్ల క్రితం చేపట్టిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నారు. చాలా వరకు పనులు చేసిన అధికారులు, కొన్ని పనులు నిలిపివేయడంతో భవనం వలస కూలీలకు అడ్డాగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన భవన నిర్మాణం పూర్తి చేయకుండా, మరోవైపు నిధులు ఖర్చుచేసి ప్రైవేట్ భవనంలో కేంద్రం నిర్వహిస్తూ దానికి రంగులు వేసి తీర్చిదిద్దుతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సంబంధిత అధికారి: శ్రీనివాస్, ఎంపీడీవో
ఫోన్ నంబర్: 9866920530

అవార్డు గ్రహీతకు సన్మానం

జన్నారం: ఇటీవల తెలుగు కళాసమితి ఆధ్వర్యంలో సినీనటుడు అలీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జన్నారం మండలం తపాలపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి గాజుల నర్సారెడ్డిని సోమవారం 1888-89బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఇదే పాఠశాలలో చదివి జూనియర లెక్చరర్‌గా రెగ్యూలర్ ఉద్యోగం సాధించిన చంద్రయ్యను కూడా సన్మానించారు.

చెరువుల పండుగను విజయవంతం చేయండి

జైపూర్/తాండూర్/చెన్నూర్‌రూరల్/భీమిని: రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న ఊరూరా నిర్వహించే చెరువుల పండుగను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. సోమవారం ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి చెరువుల వద్ద చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జైపూర్‌లో ఎంపీడీవో సత్యనారాయణ, తాండూర్‌లో జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, సర్పంచ్ పూదరి నవీన్‌గౌడ్, తాండూర్‌లో పంచాయతీ కార్యదర్శి తపస్‌కుమార్, గ్రామ పంచాయితీ సిబ్బంది, చెన్నూర్‌లో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్ అలీ, ఆయా శాఖల అధికారులు, భీమినిలో ఎంపీపీ రాజేశ్వరి, డీఎల్‌పీఓ ఫణీందర్‌రావు, ఎంపీడీఓ రాధాకిషన్, ఎంపీఓ సబ్దర్‌అలీ, సతీష్, ఇరిగేషన్ ఏఈ ప్రణీత్, ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్‌రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉత్సవాలు ఎలా నిర్వహించేది?

కోటపల్లి: మండలంలో మనఊరు చెరువు పండుగ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించగా దశాబ్ది ఉత్సవాలకు ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే ఉత్సవాలను ఎలా నిర్వహించేదని మండల సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. నిధులు ఇవ్వరూ, ప్రతి ఒక్కటి పంచాయతీ నిధుల నుంచే పెట్టాలంటే అందులో కూడా నిధులు లేకపోవడంతో సొంత ఖర్చులతో నిర్వహించాలా అని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికి వేలకు వేలు పెట్టి, అప్పులు చేసి, కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా రాలేదని సర్పంచ్‌లు ఎంపీడీవో భాస్కర్‌తో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని, ఆ తర్వాత కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సర్పంచ్‌లు తెలపడంతో రెండు, మూడు రోజుల్లో నిధులు మంజూరవుతాయని సర్పంచ్‌లకు ఎంపీడీవో సూచించడంతో సమావేశం ముగించారు. కార్యక్రమంలో ఏవో మహేందర్, డీఈ వెంకటస్వామి, ఏఈఈ హరికృష్ణ పాల్గొన్నారు.

'ఎస్టీపీపీ అధికారుల తీరుపై ఆగ్రహం'

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్ అధికార యంత్రాంగంపై స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సింగరేణి సంబురాలు నిర్వహించగా, జైపూర్ సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో సైతం పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. కాగా ఎస్టీపీపీ అధికారులు స్థానిక పవర్‌ప్లాంట్ ప్రభావిత గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులను కనీసం ఆహ్వానించకపోవడంపై వారు గుర్రుగా ఉన్నారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరు కావడంతో కొంతమంది ప్రజాప్రతినిధులు, నాయకులు పవర్‌ప్లాంట్‌కు వచ్చినప్పటికీ, విప్ బాల్క సుమన్ ముందుగా ప్రసంగించి వెళ్లిపోగా, నాయకులు సైతం ఆయన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయారు. కనీసం స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులను సంబురాలకు పిలవకుండా, అవమానించారని బీఆర్ఎస్ పార్టీ అనుబంధ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బేతు తిరుపతిరెడ్డి అధికారుల తీరుపై మండిపడ్డారు.

అక్రమ కట్టడం కూల్చివేత

జన్నారం: మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా ప్రభుత్వభూమిలో నిర్మించిన కట్టడాన్ని పొనకల్ గ్రామ పంచాయతీ సిబ్బంది కూల్చివేశారు. పొనకల్ పరిధిలోని జీసీసీ ఎదుట ఓ వృద్ధుడు అక్రమంగా షెడ్డు నిర్మించగా, షెడ్డు తొలగించాలని రెండుసార్లు గ్రామ పంచాయతీ సిబ్బంది నోటీసులు పంపారు. అయినా తొలగించకపోవడంతో సోమవారం ఈవో రాహుల్ ఆధ్వర్యంలో సిబ్బంది షెడ్డును తొలగించారు. ప్రభుత్వ భూమిలో, రోడ్డు పక్కనా అక్రమంగా కట్టడాలు జరిపితే, ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కూల్చివేసిన అక్రమ కట్టడం

'వీవోఏల సమ్మె తాత్కాలిక వాయిదా'

కోటపల్లి: మహిళా సమాఖ్యాలో సుమారు 50రోజులుగా సమ్మె చేసిన వీవోఏలు సోమవారం నుంచి సమ్మె విరమిస్తున్నట్లు ఏపీఎం రాజన్నకు వినతిపత్రం అందజేశారు. వీవోఏల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని, సమస్యలు పరిష్కారం కాకుంటే మళ్లీ సమ్మె చేస్తామని తెలిపారు.

రోడ్డుకు మరమ్మతు

భీమారం: మండల కేంద్రం సమీపంలో ప్రధాన రహదారిలో పూడుకుపోయిన రెండు లారీలను తొలగించి అధికారులు రోడ్డుకి మరమ్మతు చేయడంతో సోమవారం రాకపోకలు ప్రారంభమయ్యాయి.

సంక్షిప్త వార్తలు

కల్లంపల్లిలో వైద్య శిబిరం

వేమనపల్లి: మండలంలోని కల్లంపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జ్వరాలతో బాధపడుతున్న పలువురి రక్తనమూనాలు సేకరించారు. బీపీ, షుగర్, డెంగ్యూ, మలేరియా వంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

శివకేశవ ఆలయ 'జీర్ణోద్ధరణ'

భీమిని: మండలంలోని జగ్గయ్యపేటలోని పురాతన శివకేశవ ఆలయంలో సోమవారం ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం నిర్వహించారు. గణపతి పూజ, వాస్తు, పుణ్యవచనం, అగోర హోమాలు నిర్వహించారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో, గ్రామస్తుల సహకారంతో పునఃనిర్మాణం చేయనున్నారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

కోటపల్లి: ఉపాధిహామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జక్కుల మారన్న డిమాండ్ చేశారు. కోటపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాడే లక్ష్మి, పోచం, మల్లేశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పలి గ్రామంలోని పీహెచ్‌సీలో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. రాబోయే వర్షాకాలంలో ఎలాంటి వ్యాధులు సంక్రమిస్తాయో, వాటి బారి నుంచి ఏ విధంగా రక్షణ పొందాలో, ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలకు, ఆశాలకు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యుడు ముస్తఫా, సీహెచ్‌వో రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, హెచ్ఈవో జగదీశ్, హెచ్‌వీ భారతి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
చెన్నూర్ : క్రిష్ - 8309865990
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899